క్లుప్తంగా

'పైసలు ఇస్తేనే పనులు'

మల్హర్: మండల కేంద్రం తాడిచర్ల తహసీల్దార్ కార్యాలయంలో పైసలు ఇస్తేనే పనులు జరుగుతున్నాయని భారత ఐక్య యువజన సమాఖ్య (యూవైఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాపుయాదవ్ ఆరోపించారు. మండలంలోని కొయ్యూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తహసీల్దార్ కార్యాలయంలో పేదవాళ్లకు కుల, నివాసం, ఆదాయం, బర్త్ సర్టిఫికెట్లకు, రైతులకు పహణిలు ఇవ్వడానికి రూ.100 నుంచి రూ.1000 వసూల్ చేస్తున్నట్లు ఆరోపించారు. పైసలు ఇవ్వని వారిని మాత్రం నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పుకుంటూన్నారని విమర్శించారు. దీనిపై జిల్లా దృష్టిసారించాలన్నారు.

నియామకం


రాజేశ్

భూపాలపల్లి రూరల్: క్రైస్తవుల హక్కుల రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన కప్పల రాజేశ్‌ను నియమించినట్లు ఆ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఈసారపు ఏలిసా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర రక్షణ సమితి, నాయకులకు రాజేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి



ములుగు రూరల్: భగత్‌సింగ్ రాజ్ గురు సుఖదేవ్‌ల స్ఫూర్తితో యువత సేవా కార్యక్రమాల్లో ముందుండాలని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించగా ముఖ్య అతిథిగా డాక్టర్ జగదీశ్ హాజరై మాట్లాడారు. డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ రక్తదాన శిబిరం నిర్వహించడం సంతోషించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు రవీందర్, రంజిత్, నవీన్, రాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు రవితేజ, రవి, బలేశ్వర్, రాకేష్. చరణ్, నరేష్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

కన్నాయిగూడెం: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జీసీడీఓ రమాదేవి అన్నారు. మండలంలోని ముప్పనపల్లిలో ఉన్న కేజీబీవీని జీసీడీఓ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలను వంట గదిని పరిశీలించారు. మెనూ ప్రాకారం ఆహారం అందించాలని, పాఠశాల ఆవరణలో పరిశుభ్రతను పాటించాలని సూచించారు.

సన్మానం



ఎస్ఎస్‌తాడ్వాయి: తాడ్వాయి రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేసిన సురేష్‌బాబును ఇటీవల తహసీల్దార్‌గా నియమించారు. దీంతో తహసీల్దార్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దేవేందర్, జాతర చైర్మన్ లచ్చుపటేల్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాక సాంబయ్య, మాజీ సర్పంచులు ఇర్ప సునీల్‌దొర, నరసింహస్వామి, నాయకులు నరేష్ పాల్గొన్నారు.

కుంటుపడుతున్న పల్లెపాలన

- గ్రామాలకు నిలిచిన నిధులు
- ఇబ్బంది పడుతున్న పంచాయతీ కార్యదర్శులు


తాడిచర్ల గ్రామ పంచాయతీ కార్యాలయం

మల్హర్: సర్పంచ్‌ల పదవీకాలం 2024 జనవరి 31తో ముగిసింది. అప్పటి నుంచి జీపీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. గ్రామ పంచాయతీల్లో నిధులు లేక పల్లెలపాలన కుంటుపడుతుంది. వీధి దీపాలు, బోరు మోటార్ల మరమ్మతులు, ట్రాక్టర్లకు డీజిల్ సమకూర్చాడానికి నిధులు లేని పరిస్థితి నెలకొంది. కార్మికులకు జీతాలు, విద్యుత్ బకాయిలు చెల్లంచలేక కార్యదర్శులు ఇబ్బందలు పడుతున్నారు. జీపీలను ప్రత్యేకాధికారులు పట్టించుకోక పోవడంతో కార్యదర్శిలపైనే భారం పడుతోంది. అయితే గ్రామ పంచాయతీలలో మౌలిక వసతులు కల్పన కోసం, వివిధ అభివృద్ధి పనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలో ఉన్న జనాభా ప్రతిపాదికన ఆరు నెలలకు ఒకసారి నిధులు మంజూరు చేస్తోంది. అయితే గత సంవత్సరం ఫిబ్రవరి నుంచి కేంద్రం నిధులు విడుదల చేయకపోవడంతో గ్రామ పంచాయతీలలో అభివృద్ధి కుంటుపడుతుందని ప్రజలు వాపోతున్నారు.

నిలిచిన నిధులు

మండలంలో 15 గ్రామ పంచాయతీలు ఉండగా 22 గ్రామాలున్నాయి. ఆయా గ్రామ పంచాయతీలలో సుమారు 25343(2011 జనాభా లెక్కల ప్రకారం) జనాభా ఉన్నారు. అయితే ఒక్కరికి కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి సుమారు రూ.740 అందజేస్తోంది. ఈ లెక్కాన చూసుకుంటే గత ఏడాదికి 2023–24 సంవత్సరానికి మండలానికి దాదాపు రూ.1,87,53,820 వచ్చాయి. కానీ సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో సంవత్సర కాలంగా కేంద్రం నిధులు నిలిచిపోయాయి. దీంతో గ్రామాల్లో పనుల నిర్వహణకు ఇబ్బందులు ఎందుర్కొంటున్నామని పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు.

రెండు నెలలుగా అందని జీతాలు

రాష్ట్ర ప్రభుత్వం మల్టీపర్పస్ వర్కర్లకు సంబంధించిన వేతనాలు కూడా రెండు నెలలుగా ఇవ్వడం లేదు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారుతుందని వారు వాపోతున్నారు. గ్రామ పంచాయతీలకు వివిధ పన్నుల రూపంలో వచ్చినా నిధులు జీపీల్లో అందుబాటులో ఉన్నప్పటికీ ఫ్రీజింగ్ ఉండడంతో చెక్కులు సకాలంలో పాస్ కావడం లేదని పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా జీపీలకు సంబంధించిన బిల్లులు సకాలంలో పాస్ అయ్యేలా చూడాలని వారు కోరుతున్నారు.

జీతం రాలేదు



రెండు నెలలుగా జీతాలు రావడం లేదు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి రెండు నెలల జీతాన్ని చెల్లించి, ఇబ్బందులు తొలగించాలి.

– అజ్మత్‌అలీ, కారోబార్, తాడిచర్ల, మల్హర్

ఉద్దెర ఇవ్వడానికి నిరాకరణ..

గ్రామ పంచాయతీలకు కావాల్సిన బల్బులు, బ్లీచింగ్ పౌడర్, తదితర వాటిని సంబంధిత ఏజెన్సీలు గ్రామ పంచాయతీలకు ఉద్దెర ఇస్తారు. ఆ ఏజెన్సీలకు బిల్లులు సకాలంలో అందకపోవడంతో వారు కూడా ఇవ్వడానికి నిరాకరిస్తున్నారని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. అలాగే చెత్త సేకరణ నిర్వహణకు వినియోగించాల్సిన ట్రాక్టర్లలకు వాహనాల్లో డీజిల్ పోయాడానికి నిధులు లేక పోవడంతో ఒకటి, రెండు పంచాయతీల్లో మినహా ట్రాక్టర్లను కార్యదర్శులు వినియోగించడం లేదు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి


మొగుళ్లపల్లి: మొట్లపల్లిలో పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న అధికారులు

మొగుళ్లపల్లి: పదో తరగతి విద్యార్థులకు నేటి(శుక్రవారం) నుంచి నిర్వహించనున్న పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి లింగాల కుమారస్వామి తెలిపారు. గురువారం ఎంపీడీఓ హుస్సేన్, ఎంపీఓ సుభాష్‌చందర్‌తో కలిసి ఆయన పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, మొగుళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 170 మంది విద్యార్థులు, మొట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 96 విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు.

టేకుమట్ల: పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు మండల విద్యాధికారి సుధాకర్ తెలిపారు. మండల కేంద్రంతో పాటు, మండలంలోని రాఘవరెడ్డిపేట, కుందనపల్లి, వెలిశాల, గర్మిళ్లపల్లి, వెంకట్రావుపల్లి ఉన్నత పాఠశాలలకు చెందిన 140 మంది పది పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు.

చిట్యాల: పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని మండల విద్యాధికారి కోడెపాక రఘుపతి తెలిపారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 160, బాలికల గురుకుల పాఠశాలలో 190 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

కాళేశ్వరం: పదో తరగతి పరీక్షలకు సిద్ధం చేసినట్లు ఎంఈఓ ప్రకాశ్‌బాబు తెలిపారు. మహదేవపూర్ మండల కేంద్రంలో ఎంఆర్సీలో ఇన్విజిలేటర్లతో ఎంఈఓ సమావేశం నిర్వహించారు. మహదేవపూర్ మండలంలో మొత్తం 403 మంది విద్యార్థులకు గాను రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పరీక్షలకు ఒక డీఓ, ఒక సీఎస్‌తో పాటు 24 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు.

చట్టాలు, హక్కులపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో గురువారం మహిళ అభివృద్ధి శిశు సంక్షేమ, వయోవృద్ధుల–దివ్యాంగుల శాఖ ఆధ్వర్యంలో మహిళలు, పిల్లలు, వయోవృద్ధులు, దివ్యాంగులకు సంబంధించిన చట్టాలు హక్కుల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అంగన్‌వాడీ ద్వారా అందించే సేవలు గురించి సూపర్‌వైజర్ రజిత వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సరళ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రజిత, మాధవి, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఇన్‌చార్జ్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ అనూష, మమత, సఖి సెంటర్ కేస్ వర్కర్స్ సరిత, చైల్డ్ హెల్ప్ లైన్ మెంబర్ సాయిరాం, హెల్త్ సూపర్‌వైజర్ సునీత, జమున స్టాఫ్‌నర్స్ సరిత పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

మల్హర్: మండలంలోని తాడిచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 5 నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియేట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు గురువారం తాడిచర్ల ఎగ్జామ్స్ సెంటర్‌లో జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 126 విద్యార్థులకు గాను 122 మంది విద్యార్థులు హాజరయ్యారు. డీఈసీ మెంబర్ విజయదేవి పరీక్ష సెంటర్‌ను పరిశీలించారు. పరీక్షల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ


మల్హర్: ఉపాధ్యాయులతో విద్యార్థులు


భూపాలపల్లి రూరల్: జంగేడులో..

భూపాలపల్లి రూరల్: మండలంలోని జంగేడు ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠలు బోధించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ దేవానాయక్ హాజరై మాట్లాడారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైందన్నారు. అనంతరం పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేసి పదోన్నతిపై వెళ్లిన కృష్ణమోహన్, రమేశ్‌లను సన్మానించారు. కమలాపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు పద్మావతి, ప్రధానోపాధ్యాయురాలు సునీత పాల్గొన్నారు,

మల్హర్: మండలంలోని రుద్రారం ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వయం పాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శెట్టి శైలజ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ చంద్రగిరి శ్యామల, ఉపాధ్యాయులు అరుణ, శ్రీధర్, వెంకట్‌రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధిని ఓర్వలేకనే ఆరోపణలు

- పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అభినయ్‌చారి


మాట్లాడుతున్న అభినయ్‌చారి

ములుగు: జిల్లాలో మంత్రి సీతక్క చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీజేపీ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రేసోజు అభినయ్‌చారి అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి సీతక్క చొరవతో ములుగులో అత్యాధునిక పద్ధతిలో బస్టాండ్ నిర్మాణం జరగనుందని అన్నారు. టెండర్ వేయడం, డిజైన్ పరిశీలన పనులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రక్రియకు కొంచెం సమయంపట్టే అవకాశం ఉందనేది గమనించాలని అన్నారు. బస్టాండ్ ఆవరణలో పోచమ్మ గుడిని లేకుండా చేస్తున్నారనేది అవాస్తవ ప్రచారం అని, శివరాత్రి రోజు భక్తుల ముందే గుడిని తొలగించకుండా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పిన మాటలు బీజేపీ నాయకుల చెవినపడలేదా అన్ని ప్రశ్నించారు. సందీప్, సాయి, అతీఫ్, రఫీద్, హేమంత్, రోహిత్, సంజీవ్, పవన్, బన్నీ పాల్గొన్నారు.

మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న నాయకులు

రేగొండ: అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించడంతో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్ ఆధ్వర్యంలో మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి గురువారం పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు మైస రమేశ్, నాయకులు బోట్ల సుధాకర్, కోలేపాక సాంబయ్య, రొంటాల రఘుపతి, గడ్డం నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

లారీ కింద పడిన ద్విచక్ర వాహనదారుడు

- సురక్షితంగా బయటికి..



లారీ టైర్లకింద పడి నుజ్జయిన బైక్, ప్రాణాలతో బయటపడిన రాజు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పలుగుల గ్రామశివారులో ఇసుక క్వారీకి వచ్చిన లారీ కింద ఓ ద్విచక్రవాహనదారుడు పడి సురక్షితంగా బయటపడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. గురువారం మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం బబ్బెర చిలుక గ్రామం నుంచి మద్దికల రాజు మహదేవపూర్ మండలం పలుగు గ్రామంలోని అతడి బావ ఇంటికి వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో పలుగుల శివారులో లారీలు జామ్ అయ్యాయి. దీంతో బైక్‌పై మరోవ్యక్తి కలిసి రోడ్డుపై నిలిపి ఉండగా లారీ వెనుకకు వచ్చి అతడిని బలంగా ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంతో పాటు రాజు లారీ రెండు టైర్ల కింద పడిపోయాడు. ద్విచక్రవాహనం నుజ్జు కాగా, రాజు ఎలాంటి గాయాలు కాకుండా మృత్యుంజయుడిగా బయటికి వచ్చాడు. తనతో బైక్‌పై ఉన్న వ్యక్తి కూడా ఏమి కాలేదు. లారీ డ్రైవర్ తప్పిదంతో ప్రమాదం జరిగిందని స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు లారీతో పాటు డ్రైవర్‌ను కాళేశ్వరం పోలీసుస్టేషన్‌కు తరలించారు.

వనదేవతకు ఘనంగా ఎదుర్కోలు


మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

మంగపేట: మండలంలోని నిమ్మగూడెం పంచాయతీ పరిధిలోని తిమ్మాపురంలో కొమురంవారి వంశస్తుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న గుట్ట మునలమ్మ(సమ్మక్క–సారమల్మ) జాతర మూడో రోజు గురువారం ఎదుర్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ సమీపంలోని ఉన్న మునలమ్మ గుట్టపై ఆదివాసీ పూజారులు, వడ్డెలు ఆదివాసీ గిరిజన రహస్య పూజలు నిర్వహించి వనదేవత(కంకవనం) వనాన్ని గ్రామ పొలిమేరలోకి తీసుకునివచ్చారు. ఆదివాసీ గిరిజనుల ఆచారం ప్రకారం గుట్ట మునలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వనదేవతకు ఎదుర్కోలు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునలమ్మ ఆలయం దేవర బాల(పూజారి) కొమురం రామయ్య, కొమరం వంశస్తుల ఇలవేల్పు రెక్కల రామక్క ట్రస్టు బోర్డు చైర్మన్ కొమరం రాంమ్మూర్తి, గ్రామ పెద్దలు కొమురం రామకృష్ణ, కొమురం సారయ్య, కొమురం నాగేశ్వర్‌రావు, రేశ నర్సింగరావు, కొమురం బాలయ్య, నర్సయ్యటీచర్, బోర్రయ్య, వెంకటేశ్వర్లు, బాబు, డాక్టర్ మహేందర్, కొమురంభీం యూత్ సభ్యులు కొమురం వాసు, రవి, గణేష్ ఉన్నారు.

భూపాలపల్లి రూరల్: సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు



వర్గీకరణ, కులగణన దేశానికే ఆదర్శం

ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన బిల్లులు అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదం తెలపడం దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన బిల్లులు అసెంబ్లీలు అసెంబ్లీలో అమోదం తెలపడంతో జిల్లా వ్యాప్తంగా పలు మండల కేంద్రాల్లో కాంగ్రెస్ నాయకులు, పలు సంఘాల నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు గురువారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు అన్ని వర్గాలకు సమన్యాయం జరిగేలా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ పాలన కొనసాగుతుందన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

టేకుమట్ల: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు




రేగొండలో..


మొగుళ్లపల్లిలో..


చిట్యాలలో..


కాళేశ్వరంలో..

సైడ్‌బర్మ్‌లు మరిచారా?


ఒకవైపు ఎత్తు, మరో వైపు తక్కువగా ఉన్న రోడ్డు


సైడ్ బర్మ్ లేని సీసీ రోడ్డు

- వాహనదారులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు

ఏటూరునాగారం: మండలంలోని శంకరాజుపల్లి గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్లకు ఇరువైపులా సైడ్ బర్మ్‌లు లేక ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీరాజ్, ఇంజనీరింగ్‌శాఖ ద్వారా నిర్మించిన సీసీ రోడ్లు పూర్తి చేసిన కాంట్రాక్టర్ సైడ్ బర్మ్స్ పోయకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలకు సైడ్ ఇవ్వలేక, కిందకు దిగలేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అంతేకాకుండా ఒక రోడ్డు ఎత్తు తక్కువ, మరో రోడ్డు ఎత్తు ఎక్కువగా నిర్మించడంతో వాహనాలు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. ఈ విషయంపై పంచాయతీరాజ్ శాఖ అధికారులు స్పందించి సీసీ రోడ్లకు సైడ్ బర్మ్‌లు నిర్మించి వాహనదారుల ఇబ్బందులు తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కిందకు దిగలేని పరిస్థితి..



రొయ్యూర్, శంకరాజుపల్లిలోని పలు సీసీ రోడ్లు సైడ్ బర్మ్‌లు లేక రోడ్లు అధ్వానంగా మారాయి. ఎదురెదురుగా వాహనాలు వస్తే కిందకు దిగలేని పరిస్థితి. అధికారులు సైడ్ బర్మ్స్ నిర్మించి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూడాలి.

– శ్రీనివాస్, రొయ్యూర్, ఏటూరునాగారం

ఇబ్బందులు తొలగించాలి



రోడ్లు నిర్మిస్తున్నారు కానీ సైడ్ బర్మ్‌లు లేక వాహనదారులు కిందపడి పోతున్నారు. దీంతో గాయాలై ఆస్పత్రి పాలవుతున్నారు. రోడ్ల నిర్మాణం పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ సీసీ రోడ్లు నిర్మించిన వెంటనే సైడ్ బర్మ్‌లు నిర్మించి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలి.

– వినుకోలు చక్రవర్తి, ఏటూరునాగారం

బొగ్గుల వాగుపై ఆనకట్ట నిర్మించాలి

ములుగు రూరల్: బొగ్గుల వాగుపైన ఆనకట్ట నిర్మించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజాద్ పాషా అన్నారు. గురువారం మండలంలోని రామయ్యపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ములుగు మండలంలోని ఒక పంట సాగు నీరుకు కూడా నమ్మకం లేదన్నారు. జగ్గన్నగూడెం, లాలై గూడెం గ్రామాల మధ్య బొగ్గుల వాగుపైన ఆనకట్ట నిర్మిస్తే కొత్తగూడెం మండలానికి రోడ్డు సౌకర్యంతో పాటు మండలంలోని 25 గ్రామాలకు సుమారుగా 10 వేల ఎకరాల పంటకు సాగు నీరు అందించవచ్చు అ ని అన్నారు. లక్నవరం ముంపు గ్రామాలకు ఎస్సారేస్పీ కాలువ ద్వారా సాగునీరు అందించాలని అన్నారు. అనంతరం గ్రామ రైతు కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వాంకుడోత్ వెంకట్రావు, ప్రధాన కార్యదర్శిగా రాజు, ఉపాధ్యక్షులుగా రాములు, లావుడ్య సాజన్, సహాయ కార్యదర్శిగా జగన్, కమిటీ సభ్యులుగా శంకర్, బద్రు, లచ్చిరాం, జోహార్, బాలు తదితరులను ఎన్నుకున్నారు.